క్లుప్తంగా

వాసవీమాతకు సారె సమర్పణ



అమ్మవారికి సారె, చీర సమర్పిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: వాసవీ కన్యకపరమేశ్వరీ అమ్మవారి దేవాలయానికి పట్టు వస్త్రాలు, 52 రకాల పిండి వంటలతో వాసవీక్లబ్ విజయనగరం అధ్యక్షులు విజ్జపు విజయ్ చీర, సారె కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్వరలో క్లబ్ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆలవెల్లి శేఖర్, ఎవి.కృష్ణారావు, మాచర్ల చంద్రశేఖర్ గుప్త, డిమ్స్ రాజు, కట్టమూరి శంకరరావు, గుడిశా వినోద్, రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



జోగినాయుడు(ఫైల్)

తెర్లాం: మండలంలోని కుసుమూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కోడూరు జోగినాయుడు(68) గురువారం మృతి చెందారు. గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న జోగినాయుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. జోగినాయుడు కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. కుసుమూరు మాజీ సర్పంచ్‌గా పని చేసిన జోగినాయుడు లేని లోటు గ్రామానికి, పార్టీకి తీర్చలేనిదన్నారు. ఆయనతో పాటు కుసుమూరు సర్పంచ్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, స్థానిక పార్టీ నాయకులు జోగినాయుడు మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈయనకు భార్య, వివాహితులైన పిల్లలు ఉన్నారు. జోగినాయుడు మృతదేహానికి కుటుంబ సభ్యులు శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మొక్కలతోనే మానవాళికి మనుగడ



మొక్కలు నాటుతున్న సీఐ తదితరులు

బొబ్బిలి: ప్రజలు మొక్కలు నాటే కార్యక్రమాలను విరివిగా చేపట్టాలని సీఐ కె.సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని భూ సమేత వేంకటేశ్వరాలయం ఎదురుగా శుక్రవారం మొక్కలను నాటారు. గ్రీన్ బెల్ట్ సొసైటీ సీఈవో ఎస్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన సీఐ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కేవలం మొక్కల ద్వారానే సాధ్యమన్నారు. గ్రీన్‌బెల్ట్ సభ్యులు, పట్టణ ప్రముఖులైన పుల్లెల శ్రీనివాసరావు, అనిల్ కే సత్యరాజ్, జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మడ్డువలసలో చేపల వేట నిషేధం



వంగర వద్ద మత్స్యకారుల బోట్లు పరిశీలిస్తున్న ప్రసాద్

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో చేపలు వేట నిషేధం అమలులో ఉందని రాజాం మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వీవీ ప్రసాద్ అన్నారు. వంగర వద్ద మడ్డువలస రిజర్వాయర్‌లో మత్స్యకారుల బోట్లును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఐదు ఫసలీలకు సంబంధించి లీజు మొత్తం రూ.70లక్షలు వరకు సొసైటీ చెల్లించలేదని, లీజు మొత్తం చెల్లించినంత వరకు చేపల వేట నిషేధం అమలులో ఉంటుందన్నారు. అనంతరం వంగర పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలకు సమాచారం అందించారు.

రెండు చూడి పశువులు మృతి



మృతి చెందిన చూడి గేదెలు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో రెండు చూడి పశువులు శుక్రవారం మృతి చెందాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కింతాడ సత్యారావు కళ్లంలో ఉన్న తన రెండు చూడి గేదెలకు కుడితి పెట్టాడు. అక్కడకు కొద్ది సేపటికి రెండు గేదెలు సొమ్మసిల్లి పడిపోవడంతో పశువైద్యులను రప్పించి వైద్యసేవలు అందించారు. అయితే అప్పటికే రెండు గేదెలు చనిపోయాయి. కుడితిలో యూరియా కలవడం వల్ల పశువులు మృతి చెందినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. సుమారు రెండు లక్షల రూపాయల విలువైన పశువలు చనిపోవడంతో బాధితుడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

కల్యాణ వేడుక.. ఖరీదైన వేదిక..!



పెళ్లి వేడుకకు సిద్ధంగా ఉన్న కల్యాణ మండపం

- శ్రావణ మాసంలో జోరుగా సాగుతున్న పెళ్లిళ్లు
- మధ్య తరగతి ప్రజలకు తప్పని ధరాఘాతం

విజయనగరం: శ్రావణ మాసం.. శుభకార్యాలకు పెట్టింది పేరు. నెలంతా మంచి ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్ల సందడి మొదలైంది. జంటలు ఒక్కటయ్యేందుకు సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా పల్లె, పట్టణం తేడా లేకుండా పెళ్లిళ్ల హడావుడి కనిపిస్తోంది. ఊరూరా భాజాభజంత్రీలు మోగుతున్నాయి. పెరిగిన ఖర్చులతో మధ్య తరగతికి భారంగా మారింది. శ్రావణ మాసం ఈ నెల ఆగస్టు 23తో ముగియనుంది. ఈ నెలలో ఇప్పటి ఉన్న ముహూర్తాలతో పాటు రానున్న 10, 11, 13, 14, 15, 17, 18 తేదీల్లో ముహూర్తాలు ముమ్మరంగా ఉన్నాయి ముఖ్యంగా 13, 14 తేదీల్లో అత్యధికంగా పెళ్లిళ్ల జరగనున్నాయి. దాంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. నగర వ్యాప్తంగా వివాహాలకు సంబంధించి కొనుగోళ్లతో వస్త్ర, బంగారు దుకాణాలలో రద్దీ పెరిగింది. ముహూర్తాలు మొదలు కావడంతో డెకరేషన్, ఫొటోగ్రఫీ, ఈవెంట్లు, క్యాటరింగ్ నిర్వాహకులు తీరిక లేకుండా ఉన్నారు.

ఎరిగిన ఖర్చులు

గతంలో వివాహ వేడుకలంటే బ్యాండ్ మేళాలు, భాజా భజంత్రీలు, పూల మండపాలు, వీడియో షూటింగ్లు వంటివి చాలా సాధారణంగా ఉండేవి. ప్రస్తుతం ట్రెండ్ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు, ప్రీ వెడ్డింగ్ షూట్లకు ప్రకృతి సోయగాలతో పేరున్న ప్రాంతాలకు వెళ్తున్నారు. కాబోయే వధూవరులతో ప్రత్యేక పాటలు రూపకల్పన చేస్తున్నారు. కల్యాణ మండపంలో ఎల్‌ఈడీ స్క్రీన్లను ప్రదర్శించడం వంటివి చేస్తున్నారు. సంపన్నులైతే పెళ్లిళ్ల కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన వారు, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేసేవారు ఖర్చుకు వెనుకాడడం లేదు. అదే సమయంలో మధ్య తరగతి వర్గాల వారు పెరిగిన పెళ్లిళ్ల ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారు.

రూ.30 వేల నుంచి రెండున్నర లక్షల వరకు..

వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండడంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. మినీ ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాళ్లు నగరంలో మొత్తంగా 70కి పైగా ఉండగా, వీటితో పాటు ఆలయాల్లో ఉన్న హాల్స్ కూడా బుక్ అయిపోతున్నాయి. ఫంక్షన్ హాళ్ల బట్టి అద్దెలు వసూలు చేస్తున్నారు. మినీ ఫంక్షన్ హాల్ అయితే అద్దె రూ.30వేల నుంచి రూ.2లక్షల వరకు ఉంది. ఇవి కాకుండా పూల డెకరేషన్, లైటింగ్, భోజనాల ఖర్చు వంటి వాటితో కలిపి ప్రస్తుతం మినీ ఫంక్షన్ హాల్ రూ.2.50లక్షలకు పైగా ఉంటోంది. పెద్ద కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాల్స్‌కు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఇదే సమయంలో బోటిక్స్, బ్యూటీషియన్లకు కూడా డిమాండ్ పెరిగింది.

చిల్లర దుకాణాలపై హైవే అధికారుల ఉక్కుపాదం



సవరవల్లి జంక్షన్ వద్ద హైవే పక్కన ఉన్న దుకాణాలను తొలగించిన హైవే అధికారులు

భోగాపురం: మండలంలోని సవరవిల్లి జంక్షన్ వద్ద జాతీయ రహదారి పక్కన కొన్నేళ్ల నుంచి కొంత మంది స్థానికులు చిల్లర దుకాణాలు పెట్టుకుని వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు. ఇంతలో శుక్రవారం హైవే అధికారులు ఉన్నట్టుండి ఒక్కసారిగా వచ్చి కొన్ని దుకాణాలను జేసీబీతో తొలగించారు. దీంతో చిల్లర దుకాణాల వ్యాపారస్తులు తమకు ఎటువంటి సమాచారం లేకుండా దుకాణాలను తొలగించడం అన్యాయమని, తమకు కొంత సమయం ఇచ్చినట్లయితే దుకాణాలను తామే తొలగించుకుంటామని చెప్పడంతో హైవే అధికారులు అక్కడ నుంచి వెనుతిరిగారు. దీనిపై హైవే అధికారులను వివరణ కోరగా సవరవిల్లి జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ వంతెన లేకపోవడంతో చాలామంది వ్యక్తులు తరచూ ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. ఇక్కడ జాతీయ రహదారి పైనుంచి పుట్‌పాత్ వంతెన నిర్మించినట్లయితే కొంతవరకు ప్రమాదాలను ఆరికట్ట వచ్చుననే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుకాణాలను తొలగిస్తున్నామని చెప్పారు. స్థానికులు కోరిక మేరకు ఈ నెల 20వ తేదీ వరకు దుకాణాల తొలగింపును వాయిదా వేస్తున్నామన్నారు. త్వరలోనే భోగాపురం ఆదర్శ పాఠశాల వద్ద కూడా పుట్‌పాత్ వంతెన నిర్మించడం జరుగుతుందని హైవే అధికారులు తెలిపారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాలి



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రచార సామగ్రిని ఆవిష్కరించిన నగర పాలక సంస్థ సిబ్బంది

విజయనగరం: స్వాతంత్య్ర దినోత్సవ ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శుక్రవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రచార సామగ్రిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారతదేశానికి స్వేచ్ఛ వాయువులు లభించి ఆగస్టు 15 నాటికి 79 సంవత్సరాల పూర్తి కావస్తుందని అన్నారు. ఆ పర్వదినాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తరంగా పేరిట వివిధ కార్యక్రమాలు రూపొందించామన్నారు. వివిధ ప్రాంతాలలో సెల్ఫీ స్టాండ్లను అమర్చామని చెప్పారు. సదరు సెల్ఫీ స్టాండ్‌లో క్యూఆర్ కోడ్ ఉంటుందని సెల్ఫీ తీసుకున్న ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్‌కు తమ సెల్ఫీ ఫోటోను పంపాలని కోరారు. అలాగే ప్రశంస పత్రాలను కూడా డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పోస్టర్లు, బ్యానర్లను రూపొందించినట్లు చెప్పారు. ఆగస్టు 15వ తేదీ వరకు వివిధ రూపాలలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో సింహాచలం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత నడ్డి విరిచే కేంద్ర ప్రభుత్వ విధానాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: రైతులను నట్టేట ముంచే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ ధ్వజమెత్తారు. స్థానిక ఎన్‌పీఆర్ భవనలో శుక్రవారం జరిగిన స్వామినాథన్ శత జయంతి సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయించుకోవడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్ అని కొనియాడారు. పంటలు పండే భూములను కారు చౌకగా కార్పొరేట్లకు కేంద్రం కట్టబెడుతుండగా, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వంత పాడుతుందని ఆరోపించారు. ఐరోపాలో పని చేసి సకల సౌకర్యాలను విడిచి పెట్టి భారత దేశానికి వచ్చారన్నారు. ప్రముఖ వరి పరిశోధన కేంద్రం కటక్ పరిశోధకునిగా మొదలుపెట్టి అఖిల భారత స్థాయిలో ఉన్నత స్థాయికి ఎదగడం ఆయన మేధస్సుకు, స్వయం కృషికి నిదర్శనమన్నారు. మహిళ రైతుల హక్కుల కోసం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం సమగ్ర భూ రైతు రక్షణ సమస్యలపై రాజ్యసభ సభ్యునిగా ప్రస్తావించిన ఘనత స్వామినాధానికే దక్కుతుందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, జిల్లా అధ్యక్షుడు గోపాలం, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, కార్యదర్శి పైడిపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమలు కాని హామీలు...
ప్రశ్నిస్తే కక్షపూరిత చర్యలు



బడుకొండపేట గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు తదితరులు

విజయనగరం: బాబు ష్యూరిటీ... భవిష్యత్ గ్యారంటీ అంటూ ఎన్నికలకు ముందు ఊకదంపుడు ప్రసంగాలు చేసిన కూటమి నేతలు నేడు అబద్ధపు హామీలపై ప్రశ్నిస్తే కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాధ్ పేర్కొన్నారు. విజయనగరం మండలంలోని బడుకొండపేట గ్రామంలో స్థానిక సర్పంచ్ సారిక సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన బాబూ ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో వారు శుక్రవారం పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇచ్చిన హామీల్లో వైఫల్యాలను వివరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేసి ఏడాది పాలనలో వ్యత్యాసాన్ని వివరించారు. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోరాటం చేస్తేనే అరకొరగా కొన్ని పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు డోల మన్మధ కుమార్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గంగిరెడ్ల సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షుడు బోద అప్పలకృష్ణ, పార్టీ నాయకులు అల్తి రవి, మోపాడ ఆది తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..!



సగంలో నిలిచిపోయిన చెత్తశుద్ధి కేంద్ర నిర్మాణం

బొబ్బిలి రూరల్: కొత్త ప్రభుత్వంలో పల్లెపండగ పేరుతో ఉపాధి హామీ నిధుల చేపట్టేందుకు గ్రామాల్లో అనేక పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని సిహెచ్.బొడ్డవలస పంచాయతీలో కొత్తగా రూ.9లక్షలతో చెత్తశుద్ధి కేంద్ర నిర్మాణానికి కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఆరంభంలో నిర్మాణ పనుల్లో జోరు కన్పించింది. అనంతరం ఉపాధిహామీ నిధులు విడుదల నిలిచిపోవడంతో చెత్తశుద్ధి కేంద్రం నిర్మాణం సైతం నిలిచిపోయింది. కాంట్రాక్టర్ ఈ నిర్మాణాన్ని సగం వరకు పూర్తి చేసి చేతులెత్తేశాడు. ఇది ఎప్పటికి పూర్తవుతుందో కూడా తెలియని దుస్థితి. దీంతో గ్రామంలో సేకరిస్తున్న చెత్తను పారిశుద్ధ్య కార్మికులు ఊరు బయట కాల్చివేస్తున్నారు. దీనిపై ఉపాధి పథకం ఏపీవో లక్ష్మీపతిరాజును వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు బిల్లులు నిలిచిపోవడంతో పనులు నిలిపివేసినట్టు తెలిపారు.

చినభీమవరం రోడ్డు ఇంతేనా..!



గోతులతో బురదమయమైన చినభీమవరం రోడ్డు

బాడంగి:

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న చినభీమవరం గ్రామానికి దశాబ్దాలుగా పక్కా రోడ్డు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాలకులు మారినా తమ గ్రామానికి రోడ్డు వేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5లక్షలు డబ్ల్యూబీఎం రోడ్డు మంజూరైనా సకాలంలో పనులు జరగక.. పార్ట్ బిల్లులు అందకపోవడంతో మట్టి, కంకరు, క్రషర్ డస్టు వేసి వదిలేశారు. దీంతో మళ్లీ రోడ్డు యథాస్థితికి చేరుకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత అని చెబుతున్నా.. అవి ఉత్తి మాటలేనని తేలిపోయింది.

మండల కేంద్రానికి దగ్గరగా ఉండడంతో ప్రజల రాకపోకలు నిత్యం కొనసాగిస్తున్నా బాగు చేయాలన్న ఆలోచన కూటమి నేతలకు కలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు పట్టించుకొని రహదారికి మోక్షం కలిగించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్లకు అక్రమ గ్రావెల్



కొల్లాయివలస కొండ సమీపంలో అనుమతి లేకుండా అక్రమ క్వారీయింగ్ చేసి ట్రాక్టర్లు ద్వారా తరలిస్తున్న గ్రావెల్

పూసపాటిరేగ: రియల్ ఎస్టేట్ యజమానులు తమ వెంచర్లకు అనుమతిలేని అక్రమ క్వారీయింగ్ గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తున్నారు. లక్షలాది రుపాయిలు విలువ చేసిన భూగర్భ ఖనిజ సంపద అక్రమార్కుల పాలవుతోంది. నిత్యం వందలాది ట్రాక్టర్లు గ్రావెల్‌ను అనుమతి లేకుండా తవ్వకాలు చేసి తరలిస్తున్న సంఘటన కొల్లయివలస రెవెన్యూ పరిధిలో కొండను ఆనుకొని జరుగుతోంది. కొండను ఆనుకొని విలువైన గ్రావెల్ నిత్యం తరలించుకుపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, నూతనంగా నిర్మాణం అవుతున్న పరిశ్రమలకు ఇక్కడ నుంచే గ్రావెల్‌ను తరలిస్తున్నారు. భారీ స్థాయిలో గ్రావెల్ తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సంబంధిత భూగర్భ గనుల శాఖ అధికారులు వున్నారా.. లేరా.. అన్న అనుమానం ప్రజలకు కలుగుతోంది. భూగర్భ గనుల శాఖ అధికారులకు అక్రమ క్వారీయింగ్‌పై ఎవరైనా ఫిర్యాదు చేసినా సంబంధిత అక్రమార్కులకు క్షణాలలో సమాచారం వెళ్తుందనే ఆరోపణలు వున్నాయి. ప్రభుత్వ ధనాన్ని కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వున్నాయి. ప్రభుత్వ సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై వుంది. కానీ ఇక్కడ మాత్రం వింత పరిస్థితి నెలకొంది. గత కొంత కాలంగా కొల్లాయివలస కొండ నుంచి గుంపాం సమీపంలో రియల్ వెంచర్‌కు దర్జాగా గ్రావెల్ అనుమతి లేకుండానే తరలిపోతుంది. అక్రమ క్వారీయింగ్ దందా జరుగుతున్నా సంబంధిత అధికారుల కనీసం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకొని సహజ వనరులను కాపాడాలని సామాజిక వేత్తలు, ప్రజలు కోరుతున్నారు.

11న ఆటో డ్రైవర్ల ధర్నా



ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

విజయనగరం గంటస్తంభం: ఆటో డ్రైవర్ల సమస్యలపై ఈ నెల 11న జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. తోటపాలెం ముత్యాలమ్మ గుడి దగ్గర ఉన్న ఆటో స్టాండ్ డ్రైవర్లు సీఐటీయూ నగర అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, కార్యదర్శి బి.రమణ ఆధ్వర్యంలో యూనియన్‌లో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రవాణా రంగంలో ఆటో డ్రైవర్లు చాలా కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు, ఉద్యోగులకు ఏ అవసరం వచ్చిన తమ గమ్య స్థానాలకు సకాలంలో వెళ్లడంలో వీరు పాత్ర చాలా కీలకమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భారతీయ న్యాయ సంహిత బీఎన్ఎస్ చట్టం 106(1,2) ప్రవేశ పెట్టడం వలన డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు ఫిట్నెస్ సెంటర్ రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వమే బ్రేకు, పొల్యూషన్, రెన్యువల్, గ్రీన్ ట్యాక్స్‌లకు బాధ్యత వహించి ఆదుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలకు వెనకాడమన్నారు. కార్యక్రమంలో కె.రాంబాబు, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మన గుంతలు మనమే కప్పకుందాం..!



ఈ చిత్రంలో యువకులను చూశారా..సామాజిక బాధ్యతగా రహదారిపై ఏర్పడిన గుంతలను గురువారం అర్ధరాత్రి కప్పారు. నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారిలో రామతీర్థం పంచాయతీ దేవుని నెలివాడ వద్ద రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ఆ గ్రామానికి చెందిన యువకులు నరేష్, మహేష్, సాయి, తదితరులు ఇలా అర్ధరాత్రి వేళ తమ వంతుగా గుంతలు కప్పారు. అర్ధరాత్రి అయితే వాహన రాకపోకలు ఉండవని గుంతలు పూడ్చినట్టు వారు తెలిపారు. చాలా మంది ప్రమాదాలబారిన పడడాన్ని చూసి గుంతలు కప్పేందుకు ప్రయత్నించామని తెలిపారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారన్న నమ్మకం లేకే ఇలా ముందడుగు వేశామని పేర్కొన్నారు. – నెల్లిమర్ల రూరల్



సంతకవిటి: ఉమారామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు



వంగర: రుషింగిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

శ్రావణ శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో జరిగిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: నవదుర్గను దర్శించుకునేందుకు క్యూ కట్టిన భక్తులు

నేడు సాయిబాబా ఆలయం సిల్వర్‌జూబ్లీ వేడుకలు

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయం సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు పూజల్లో పాల్గొనాలని కోరారు.